క్లుప్తంగా

నేడు వలంటీర్లకు వందనం

వల్లూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి పాల్గొంటారని ఎంపీడీవో విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని గ్రామ వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

హైవే అధికారులపై మండిపడ్డ స్థానికులు

చెన్నూరు : చెన్నూరు పాత రోడ్డుకు అడ్డంగా డివైడర్లు అడ్డం పెడితే ఎలా వెళ్లాలి అని స్థానిక ప్రజలు జాతీయ రహదారి అధికారులను ప్రశ్నించారు. ఆదివారం కడప–కర్నూల్ జాతీయ రహదారి గోసుల కల్యాణ మండపం క్రాస్ వద్ద నుంచి చెన్నూరు పాత రోడ్డు వద్దకు వెళ్లే రహదారికి అడ్డంగా నేషనల్ హైవే అధికారులు డివైడర్లతో రోడ్డును మూసి వేసేందుకు ప్రయత్నం చేయగా చెన్నూరుకు చెందిన మైనార్టీ నాయకులు, అలాగే గ్రామ ప్రజలు ఆ పనులను అడ్డుకున్నారు. దీంతో చేసేది ఏమీ లేక నేషనల్ హైవే అధికారులు వెనుతిరిగి వెళ్లిపోయారు.

శిల్పారామంలో సండే సందడి



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక అఖిల్ డ్యాన్స్ అకాడమి చిన్నారులు తమ నృత్యాలతో అలరించారు. ఇటీవల విస్తృత ప్రచారంలో ఉన్న సినిమా పాటలతోపాటు జానపద గీతాలకు కూడా వారు హుషారు గొలిపే నృత్యాలతో ఆకట్టుకున్నారు. సందర్శకులు అడుగడుగునా ప్రోత్సహిస్తూ కరతాళ ధ్వనులు చేశారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఉచిత వైద్య శిబిరం



రోగితో మాట్లాడుతున్న డాక్టర్ మహబూబ్ అలీ

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని మెడికేర్ హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ మహబూబ్‌అలీ రోగులకు వైద్య సేవలందించారు. దాదాపు 100 మంది వైద్య సేవలు పొందారు. ఇందులో ఒక్కొక్కరికి రూ.3 వేలు విలువ గల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహబూబ్‌అలీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డైట్‌ను అనుసరిస్తూ పోషకాలు గల ఆహారంతోపాటు ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వీటి వల్ల కొవ్వు, కెలరీలు తక్కువగా ఉంటాయన్నారు. అలాగే ప్రతి రోజు క్రమం తప్పకుండా 30 నిమిషాలపాటు వ్యాయామం, నడవటం చేయాలన్నారు. ఇలా చేస్తే ఆరోగ్యం సంరక్షణతోపాటు చాలా వ్యాధులు అదుపులో ఉంటాయన్నారు. వైద్య శిబిరంలో ల్యాబ్ అధినేత సుబ్బరాయుడు, మెడికల్ రెప్స్, మెడికేర్ ఆసుపత్రి సిబ్బంది అయేషా, గౌతమి, భార్గవి, శిరషరెడ్డి, వైష్ణవి, సువర్ణ, మౌలాని, ఫఠాన్ సాయిద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

వేముల : వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. పదవ తరగతి పూర్తైన తర్వాత ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 36 సంవత్సరాల తర్వాత ఆదివారం ఒకే చోటికి చేరుకున్నారు. వీరి కలయికతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చదువుకునే రోజుల్లో నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించి గురు భక్తిని చాటుకున్నారు. పూర్వపు విద్యార్థులు తమవంతు సాయంగా రూ.10 లక్షలతో పాఠశాలకు నిధి ఏర్పాట చేస్తున్నారు. పాఠశాల పేరుతో బ్యాంక్‌లో ఖాతా తెరిచి నిధి ఏర్పాటు చేసి వచ్చే వడ్డీతో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులను అందించాలని నిర్ణయించుకున్నారు.

ఎన్‌బీఏ బృందం తనిఖీ

ప్రొద్దుటూరు : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానిక్ విభాగాన్ని నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) బృందం సభ్యుల తనిఖీలు ఆదివారం ముగిశాయి. కళాశాలలో జరిగిన సమావేశంలో ఎన్‌బీఏ చైర్మన్ డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ మెకానికల్ విభాగంలో పది విభాగాలను తనిఖీ చేయగా 9 విభాగాలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. ప్లేస్‌మెంట్ విషయంలో కళాశాల పురోగతి సాధించాలని తెలిపారు. స్థానికంగా ఉన్న పరిశ్రమలతో కళాశాల సంబంధాలు ఏర్పరచుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వరుడు మాట్లాడుతూ ఎన్‌బీఏ గుర్తింపు లభిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు, రాయితీలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బీఏ బృందం సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ అలీ, అశోక్ బాబు, కాశిరెడ్డి శ్రావణ్, సురేష్ బాబు, రాజేష్, హరీష్, మురళీ, సునీత, సువర్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విజయదుర్గ హోమం



పూజలందుకుంటున్న ప్రధాన ఉత్సవ కలశాలు



అమ్మవారి రథాన్ని లాగుతున్న భక్తులు

కడప కల్చరల్ : నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవరోజు ఆదివారం శ్రీ విజయదర్గాదేవి హోమంతో పాటు గణపతి, చండీహోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మూల విరాట్‌మూర్తికి నవకలశ స్నపనం (అభిషేకం) నిర్వహించారు. ఇందులో భాగంగా పుణ్యనదీజలాలు నింపిన కలశాలతో భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. అభిషేకనంతరం అమ్మవారికి కనుల పండుగా బ్రహ్మోత్సవ అలంకారం చేశారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జున రావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌రావు పర్యవేక్షణలో యాగశాలలో చండీహోమం నిర్వహించారు. వేద పండితులు సహజ పద్ధతిలో హోమగుండాన్ని వెలిగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నవావరణ శ్రీ చక్రార్చన నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ మూర్తిని అలంకరించి వృషభ వాహనంపై కొలువుదీర్చారు. రథాన్ని భక్తులు జయజయధ్వానాలు చేస్తూ ఆలయ ప్రదక్షిణ చేయించారు. మంగళహారతుల అనంతరం అమ్మవారికి పవళింపు సేవను నిర్వహించారు.

నేడు కల్యాణోత్సవం

ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 5 గంటలకు ఆలయ ప్రాంగణంలో శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

‘కెమిస్ట్ భవన్’ ప్రారంభం

కడప కార్పొరేషన్ : ది కడప జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని బుడ్డాయపల్లెలో మద్రాసు రోడ్డులో నిర్మల కాలేజీ పక్కన నూతనంగా నిర్మించిన కెమిస్ట్ భవన్‌ను వైఎస్సార్‌సీపీ కడప, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాల రీజినల్ కో ఆర్డినేటర్, కడప మేయర్ కె.సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు ఆదివారం ప్రారంభించారు. విశిష్ట అతిథులుగా కర్నూలు రీజియన్ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ వి.విజయ శేఖర్, సీమాంధ్ర డ్రగ్స్ డీలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.వి రత్నం, ప్రధాన కార్యదర్శి కె కరుణా కుమార్ గుప్తా, ట్రెజరర్ ఏ సాధు ప్రసాద్, కడప డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.కిరణ్ కుమార్, శ్రీకాకుళం డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్ర రావు, అన్నమయ్య జిల్లా డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్ ఎస్.జయరాముడు, కడప డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ జి.మాధవిలు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలో కెమిస్ట్ భవన్ అద్భుతంగా నిర్మించిన జిల్లా కెమిస్ట్ సోదరులను



కెమిస్ట్ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ సురేష్‌బాబు

ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. డ్రగ్ డీలర్లకు, కెమిస్ట్, డ్రగ్గిస్టలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు నరసింహమూర్తి, గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి సుబ్బారావు, సభ్యులు కేశవరెడ్డి, సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామలక్ష్మణ్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, యల్లారెడ్డి పాల్గొన్నారు.

సాహిత్యంలో ‘భూతపురి’ తనదైన ముద్ర

- అవార్డు ప్రదానోత్సవంలో వైవీయూ వీసీ

కడప కల్చరల్ : డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ తెలుగు సాహిత్యంలో విలక్షణంగా చారిత్రక అంశాలపై కావ్యాలు రచించి కవుల్లో తనదైన ముద్ర సాధించారని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. ఆదివారం డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ స్మారక ట్రస్టు, అల్లసాని పెద్దన సాహితీపీఠంతో కలిసి సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆయన 87వ జయంతి, 22వ పురస్కార ప్రదానోత్సవ సభకు వీసీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. తొలుత సుబ్రమణ్యశర్మ చిత్రపటానికి పూలమాల సమర్పించి జ్యోతి వెలిగించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ సుబ్రమణ్యశర్మ పేరిట సాహితీ కార్యక్రమాలను కొనసాగిస్తున్న ఆయన కుమారుడు భూతపురి సురేంద్రనాథ్‌శర్మ, భూతపురి గోపాలకృష్ణశాస్త్రిలను అభినందించారు. డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వీసీ ఆచార్య ఆంజనేయప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, సాహిత్యంతోపాటు జ్యోతిష్యం, వాస్తు, చారిత్రక అంశాలలో లోతైన పరిజ్ఞానం గల వ్యక్తి అని కొనియాడారు. వైవీయూ కులసచివులు ఆచార్య వీపీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ పురస్కార గ్రహీత వైద్యం వెంకటేశ్వరాచార్యులు ప్రాచీన కవుల బాటలో పయనిస్తూ



వైద్యం వెంకటేశ్వరాచార్యులుకు అవార్డు అందజేస్తున్న అతిథులు, సాహితీ ప్రముఖులు

కవిగా, విమర్శకునిగా, వ్యాఖ్యతగా, అనువాదకునిగా, పరిష్కర్తగా, బహుగ్రంథకర్తగా ప్రజ్ఞావంతుడని పేర్కొన్నారు.

పురస్కార ప్రదానం

ఈ సందర్భంగా డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ 22వ సాహిత్య పురస్కారాన్ని వైద్యం వెంకటేశ్వరాచార్యులకు అతిథులు, ప్రముఖులు అందజేశారు. భూతపురి సోదరుల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించి రూ.10,116 నగదును అందజేశారు. అనంతరం పురస్కార గ్రహీత స్పందిస్తూ భూతపురి సుబ్రమణ్యశర్మ వంటి గొప్పకవి పేరిట పురస్కారం పొందడం మరువలేమన్నారు. కార్యక్రమంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రాంప్రసాద్‌రెడ్డి, తెలుగు పండితులు బి.రాజశేఖర్, డాక్టర్ కె.గోపినాథ్, సంస్కృత ఉపన్యాసకురాలు డాక్టర్ వై.నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ హాస్టల్స్ పరిశీలించిన ఆర్డీఓ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వసతి గృహాలను కడప రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆర్.మధుసూదన్ సందర్శించారు. ఆదివారం విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న గ్రూప్– 2 పరీక్షలను తనిఖీ చేసేందుకు వచ్చిన ఆర్డీఓ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌ను కలిశారు. అనంతరం వారిరువురూ కలిసి వసతిగృహాలను, పరిసరాలను, వంటశాలలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఇటీవల అస్వస్థతకు గురై కోలుకుని హాస్టల్‌కు వచ్చిన ముగ్గురు విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందిన వైద్యసేవలు, వసతి గృహ సౌకర్యాలపై ఆరా తీశారు. అనారోగ్యానికి గురైన వెంటనే వైవీయూ అధికారులు రిమ్స్‌కు తీసుకువెళ్లి వైద్యం అందేలా చూశారని, అక్కడే ఉండి తమకు ధైర్యం చెప్పారని విద్యార్థినులు సమాధానం ఇచ్చారు. విశాఖపట్నం నుంచి వచ్చిన విద్యార్థిని తల్లి ఒకరు స్పందిస్తూ మా పిల్లలను కన్నవారిలా చూసుకున్నారని తెలిపారు. హాస్టల్లో ఉన్న 30 మంది విద్యార్థినులతో ఆర్డీఓ ప్రత్యేకంగా మాట్లాడారు. అందరం ఒకే ఆర్ఓ ప్లాంట్ నీరు తాగుతున్నామని, భోజనం కూడా ఒకే చోట చేశామని, మాకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని విద్యార్థినులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం కోసం వైవీయూ అధికారులతోపాటు, కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని



వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్, వీసీ చింతా సుధాకర్

ఆర్డీఓ వారికి భరోసా ఇచ్చారు. అనంతరం హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతూ నిత్యం అప్రమత్తంగా ఉంటూ ఆహార పదార్థాలు తయారు చేయాలని సూచించారు. ఆర్డీఓ మధుసూదన్, వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ హాస్టల్లో విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనం తిని పరిశీలించారు. ఆహార పదార్థాలు కూడా రుచిగా ఉన్నాయంటూ ఆర్డీఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం వీసీ కొన్ని ప్రతిపాదనలు చేయగా, రెవెన్యూ పరిధిలోనివి తప్పక చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. నీటి, ఆహార పదార్థాలు టెస్టింగ్ పంపామని నివేదిక రావాల్సి ఉందని ఈ సందర్భంగా వీసీ అన్నారు. నివేదిక ద్వారా మరిన్ని మార్పులు చేపట్టనున్నామని తెలిపారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

చాపాడు : విద్యార్థులు, యువకులు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమిరుద్దీన్ అన్నారు. చాపాడులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. అమీరుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా ఉదయ్‌కుమార్‌రెడ్డి

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా జీవై.వెంకటసుబ్బారెడ్డి అలియాస్ ఉదయ్‌కుమార్ నియమిస్తూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఉదయం 9 గంటలకు ఆలయ చైర్మన్‌గా ఉదయ్‌కుమార్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సర్పంచి కిషోర్‌కుమార్‌రెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి హాజరుకానున్నారు.

వీఆర్‌ఏలకు డీఏ మంజూరు

అట్లూరు : వీఆర్‌ఏలకు రూ.500 డీఏ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంతో ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కరవు భత్యం కింద వీఆర్‌ఏలకు రూ.1000 డీఏ చెల్లించాలని మంగళగిరిలోని సీసీఎల్ఏ చీఫ్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్‌కు వినతి పత్రం ఇచ్చారన్నారు. ప్రభుత్వం స్పందించి సానుకూలంగా రూ.500 డీఏ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పింఛనర్ల భవనం ప్రారంభం

పోరుమామిళ్ల : శ్రీరామచంద్ర రిక్రియేషన్ క్లబ్‌కు పూర్వ వైభవం రావాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. క్లబ్ ఆవరణలో నిర్మించిన పింఛనర్ల సంఘం నూతన భవనాన్ని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రోడ్డు విస్తరణలో క్లబ్ ఎదుట స్థలం పోవడంతో భవనం కొంత దెబ్బతిందని, దీంతో త్వరితంగా భవన నిర్మాణం చేపట్టారన్నారు. అనంతరం భవన నిర్మాణానికి కృషి చేసిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, సీఎం.బాషా, డీసీ ఆదిత్యారెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, డాక్టర్ మార్కారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఏపీ జేఏసీ నిర్ణయం సరైనది కాదు’

కడప ఎడ్యుకేషన్ : లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా నిలబడి పోరాటం చేయాల్సిన ఏపీ జేఏసీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత సాధించకుండానే ఫిబ్రవరి 27వ తేదీ చలో విజయవాడ పిలుపును వాయిదా వేయడం సరైనది కాదని ఏపీ జేఏసీ నిర్ణయాన్ని యూటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబులు తెలిపారు. 27వ తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి పోలీసులు అడ్డగిస్తారని మూడు రోజులు ముందే విజయవాడ చేరుకున్నట్లు తెలిపారు. అయితే ఏపీ జేఏసీ ఏకపక్షంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలు నీరుగార్చే విధంగా ఉందన్నారు.

కష్టాల్లో ఆదుకోవడమే ‘మానవత్వం’

కడప కల్చరల్ : సాటి మనిషిని కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకుని ఉపశమనం కలిగించడమే మానవత్వం అనిపించుకుంటుందని ప్రముఖ న్యూరో సర్జన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎర్రముక్కపల్లెలోని బాల వికాస్ హైస్కూలులో మానవత సంస్థ సమావేశాన్ని నిర్వహించారు. అధ్యక్షత వహించిన నగర అధ్యక్షులు పి.సుబ్బరాయుడు కార్యక్రమాన్ని పరిచయం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మానవత సంస్థ చేస్తున్న కార్యక్రమాలు వెలకట్టలేనివని, విలువలతో కూడిన సంస్థ కావడంతో దీనికి గౌరవం లభిస్తోందన్నారు. మానవతా విలువలు తరిగిపోతున్న ప్రస్తుత సమాజంలో ఇలాంటి సంస్థల అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర నియంత్రణ కమిటీ డైరెక్టర్ డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 110 మానవత సంస్థలు, 60 వేల మంది సభ్యులు సేవలు అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు నైతిక విలువలు



చెక్కును అందజేస్తున్న సుబ్బారెడ్డి, తులసి దంపతులు

బోధిస్తూ సమ సమాజ నిర్మాణం, శాంతియుత సమాజం కోసం సంస్థ పని చేస్తోందన్నారు. బాల వికాస్ పాఠశాల కరస్పాండెంట్ సుబ్బరాయుడు మాట్లాడుతూ సంస్థ దేశమంతటా విస్తరించాలని ఆకాంక్షించారు. సంస్థ ప్రతినిధి ఇరగంరెడ్డి కృష్ణారెడ్డి కార్యకలాపాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి, ఉషా తులసి దంపతులు నగర సమీపంలో ఏర్పాటు చేస్తున్న శ్మశాన వాటికకకు రూ.50 వేల చెక్కును మానవత సంస్థకు అందజేశారు.

ఎన్నికల నిర్వహణ పటిష్టంగా ఉండాలి

కడప ఎడ్యుకేషన్ : దేశవ్యాప్తంగా త్వరలో జరగనున్న పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా తగిన నిర్వహణ పరమైన ఏర్పాట్లు చేయాలని అఖిల భారత అభ్యుదమ వేదిక రాష్ట్ర కమిటీ కార్యదర్శి సురేష్‌బాబు కోరారు. ఆదివారం కడపలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలే ప్రజాస్వామానికి శ్రీరామరక్ష అని అన్నారు. ఎన్నికల నిర్వహణ న్యాయబద్ధంగా, సక్రమంగా జరిగినప్పుడే నిజమైన ప్రజాభిప్రాయం తెలియవస్తుందన్నారు. అధికారులు, రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో రాబోయే ఎన్నికల్లో పాల్గొనాలన్నారు. ఎన్నికల్లో అవకతవకలు జరిగి అనర్హులు అందలం ఎక్కితే ప్రజాస్వామానికి పాతరేసి నియంతృత్వం వచ్చే ప్రమాదం ఉందన్నారు. అభ్యుదయ వేదిక జిల్లా శాఖ అధ్యక్షులు విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి శంకరయ్య మాట్లాడుతూ ఎన్నికలలో ఓట్లు, డబ్బులు పంపిణీ చేయడం, పోలింగ్



మాట్లాడుతున్న అఖిల భారత అభ్యుదమ వేదిక రాష్ట్ర కమిటీ కార్యదర్శి సురేష్‌బాబు

సమయంలో దౌర్జన్యాలకు పాల్పడటం లేకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ, రాష్ట్ర ఎన్నికల కమిషన్లు ఎటువంటి రాగద్వేషాలకు ఆస్కారం లేకుండా వ్యవహరించాలన్నారు. అలాగే సమాజంలో ఉన్న మేధావులు, స్వచ్ఛంద సంస్థల వారు ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరిగే విధంగా కృషి చేయాలని సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

కడప ఎడ్యుకేషన్ : మార్చి 3న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన ఉందని డిప్యూటీ సీఎం అంజద్ బాషా పేర్కొన్నారు. రాయల్ రషీదు అసోసియేషన్ ఆధ్వర్యంలో తయారు చేసిన చిన్నారులకు పోలియో చుక్కలు అనే పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఆదివారం (3వ తేదీన) పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్ల పిల్లల వరకు పోలియో చుక్కలను వేయించుకోవాలన్నారు. ఈ విషయంపై బస్టాండులు, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ సంస్థ అధ్యక్షులు రాయల్ కరీముల్లా, మాజీ కార్పొరేటర్ జమాల్‌వల్లి, గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.



పోలియో చుక్కల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 30 కుటుంబాలు

వేంపల్లె : మండల పరిధి చింతలమడుగుపల్లెలోని జగనన్న కాలనీలో 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఆదివారం జగనన్న కాలనీలో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీ గాయత్రిలు ఆ కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆకుల సురేష్, సీతారాముడు, వాకిటి శివ, పిల్లవాళ్ల లక్ష్మీ నాగయ్య, పారి శివలతోపాటు తదితర కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. కార్యక్రమంలో ఎంపీటీసీలు కొండయ్య, పఠాన్ రహమతుల్లా, ఎస్సీ కన్వీనర్ జయరాములు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకలు



ఆలయంలో ప్రతిష్టించిన ధ్వజస్తంభం

వేముల : మండలంలోని వేల్పుల గ్రామంలో మూడు ఆలయాలలో విగ్రహ ప్రతిష్ట వేడుకలు రెండవ రోజు వైభవంగా జరిగాయి. పురోహితులు గోపినాథ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, అంకాలమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో యాగశాల, హోమగుండాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో వేణుగోపాలస్వామి, ఆంజనేయ స్వామి, అంకాలమ్మ ఆలయాలను నూతనంగా నిర్మించారు. మూడు రోజులపాటు జరిగే వేడుకలు శనివారంతో ప్రారంభమై సోమవారం విగ్రహ ప్రతిష్టతో ముగియనున్నాయి. వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ట వేద మంత్రోచ్చరణలతో ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి ఏర్పాట్లు చేశారు.

చెక్కభజన, కోలాట పోటీల నిర్వహణ

గ్రామంలో మూడు ఆలయాలలో విగ్రహ ప్రతిష్ట వేడుకలను పురస్కరించుకుని కోలాటం, చెక్కభజన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో వివిధ ప్రాంతాల నుంచి 30 టీంలు పాల్గొంటున్నాయి. ఒక్కో టీంతో నాలుగు పాటలు పాడించనున్నారు.

చక్రస్నానం.. సర్వపాపహరణం

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీవేంకటరమణుడి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో చివరిఘట్టమైన చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో ఉన్న కొలనులో చక్రస్నానం ఇత్యాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా స్నపన తిరుమంజనాన్ని ఆలయ అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతంతో అభిషేకించి తిరుమల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన శ్రీగంధం, కుంకుమ పువ్వులేపనంతో అలంకరించారు. తులసిమాల, సుగంధ వట్టివేరు మాలలతో అలంకరించి మంగళ స్నానాలు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గోవిందా..గోవిందా అంటూ దేవదేవుని వేడుకున్నారు. మహా మంగళహారతులు పట్టారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన కొలనులో చక్రస్నానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు కూడా ఆకొలనులో మునిగితేలారు. సాయంత్రం యాగశాలలో కలశారాధన ప్రధాన నిత్య హోమాలు, విశేష హోమాలు చేసి పూర్ణాహుతి చేపట్టారు. ధ్వజావరోహణ చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.



స్నపన తిరుమంజనంలో శ్రీవెంకటరమణస్వామి

హనుమద్వాహనంపై శ్రీరంగనాథుడు

– రేపు రంగనాథుని కల్యాణం

పులివెందుల టౌన్ : పట్టణంలోని పూలంగళ్ల వద్ద ఉన్న శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో జరుగుతున్న శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారు సతీసమేతుడై హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మండపంలో అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలు పర్యవేక్షించారు. సాయంత్రం పట్టణ పురవీధులలో స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ బజార్, ముత్యాలవారివీధి, గాడిచర్లవీధి, అమ్మవారిశాల వీధుల మీదుగా ఊరేగారు. ప్రత్యేక అలంకారంలో ముగ్ధమోహన రూపుడైన స్వామివారు తమ ఇంటి ముందుకు రాగానే భక్తులు చదుర్లు(ప్రత్యేక పూజలు) నిర్వహించారు. కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 6వ రోజు మంగళవారం ఉదయం శ్రీరంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

